క్లుప్తంగా

శివరాత్రికి ప్రత్యేక టూరిజం బస్సు

రాజమహేంద్రవరం సిటీ: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పర్యాటక శాఖ ఆధ్వర్యంలో 18 సీట్లు గల మినీబస్సును ఏర్పాటు చేశామని పర్యాటక శాఖ ప్రాంతీయ సంచాలకులు సీహెచ్ పవన్ కుమార్ తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ దీని ద్వారా విజయవాడ మీదుగా శ్రీశైలం వరకూ గల దేవాలయాలను సందర్శించవచ్చన్నారు. ఈ యాత్ర 25న రాజమహేంద్రవరంలో ప్రారంభమై 27వ తేదీన అదే చోట ముగుస్తుంన్నారు. మార్గం మధ్యలోని భ్రమరాంబికాదేవి ఆలయం (శక్తి పీఠం) శ్రీశైలం, శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయం (జ్యోతిర్లింగం), శ్రీశైలం, త్రిపురాంతకేశ్వర స్వామి దేవాలయం, బాలా త్రిపుర సుందరీ దేవి ఆలయాలను సందర్శించవచ్చన్నారు. వివరాలను టూరిజం కార్యాలయం నంబర్ 98486 29341ను సంప్రదించాలన్నారు.

బ్యాంకు ఉద్యోగుల ధర్నా

రాజమహేంద్రవరం సిటీ: బ్యాంకు ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం మార్చి 3వ తేదీన ఢిల్లీలోని పార్లమెంట్ ముందు నిరసన తెలుపుతామని బ్యాంక్ ఉద్యోగులు, అధికారులు సంఘ నాయకులు పాపారావు, శ్రీనివాస్ ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం ఇన్నీసుపేటలోని స్టేట్ బ్యాంక్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలని, కొత్త నియామకాలు వెంటనే చేపట్టాలన్నారు. తాత్కాలిక ఉద్యోగుల నియామకాలు ఆపాలని, ఐదు రోజుల పని దినాలు అమలు పరచాలన్నారు. ధర్నాలో శ్రీనివాస్, అప్పారావు, మురళీధర్, ప్రసాద్, స్వాతి, ప్రజ్ఞ తదితరులు పాల్గొన్నారు.

320 మందికి వైద్యసేవలు



శిబిరంలో ఎముకల సాంద్రత పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

రాజమహేంద్రవరం రూరల్: పిడింగొయ్యి పంచాయతీ బాపూజీ నగర్ గంగిరెడ్డుల కాలనీలో సత్యచారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 320 మందికి వైద్య సేవలు అందించారు. కేఎస్ఆర్ హాస్పిటల్స్ అధినేత కొమ్మా శ్రీనివాసరావు ఎముకల సాంద్రత పరీక్షలు, బుద్ధుడు హాస్పిటల్స్ వైద్యురాలు శ్వేతా సజ్జల కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి సత్య చారిటబుల్ ట్రస్టు ద్వారా కళ్లజోళ్లు పంపిణీ చేస్తామని, ఆపరేషన్లు ఉచితంగా చేస్తామని ట్రస్ట్ అధ్యక్షుడు తమ్మా రవి తెలిపారు. అలాగే బీపీ, షుగరు పరీక్షలు నిర్వహించారు.

నిబద్ధతతో విధులు నిర్వర్తించాలి



డ్రైవర్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఈడీ చంగల్ రెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: ఆర్టీసీ ఉద్యోగులు విధి నిర్వహణలో నిబద్ధతతో వ్యవహరించి, ఇతర ఉద్యోగులకు ఆదర్శంగా నిలవాలని ఆర్టీసీ ఈడీ చంగల్ రెడ్డి పిలుపు నిచ్చారు. విజయవాడ జోన్ ఈడీ విజయరత్నంతో కలిసి ఆయన శుక్రవారం రాజమహేంద్రవరం బస్ స్టేషన్, గ్యారేజ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా గేట్ మీటింగ్ నిర్వహించి సిబ్బందితో మాట్లాడారు. ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించాలన్నారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన డ్రైవర్లు, కండక్టర్లకు నగదు పురస్కారం, ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి షర్మిల అశోక, డిపో మేనేజర్ షేక్ షబ్నం పాల్గొన్నారు.

మోటారు సైకిళ్లు మాయం

కంబాలచెరువు: ప్రకాశం నగర్, త్రీటౌన్ పరిధిలో మోటారు సైకిళ్ల చోరీలపై శుక్రవారం కేసులు నమోదయ్యాయి. పోస్టల్ కాలనీకి చెందిన పినిపే దుర్గారామపండు తన బైక్ ఇంటి ముందు పార్కు చేశాడు. మర్నాడు ఉదయం చూసేసరికి కనిపించలేదు. దీనిపై ప్రకాశం నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే గోకవరానికి చెందిన వి.జాషువా ఈ నెల 5న రాజమహేంద్రవరం కోర్టుకు వచ్చి వాహనం బయట పార్కు చేసి వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి ఆ వాహనం అదృశ్యమైంది. దీనిపై మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు

దాడి ఘటనపై..

ఆర్యాపురంలో యర్రా లక్ష్మీనారాయణ పాన్ షాప్ నిర్వహిస్తున్నాడు. అక్కడకు ముగ్గురు వ్యక్తులు వచ్చి సిగరెట్లు తీసుకున్నారు. అక్కడే వాటిని వెలిగించి కాల్చసాగారు. సిగరెట్ ఇక్కడ కాల్చవద్దని చెప్పిన లక్ష్మణరావుపై దాడి చేసి కొట్టారు. దీనిపై మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెండి సామగ్రి చోరీ

బిక్కవోలు: ఇంటికి వేసిన తాళాన్ని పగలకొట్టి కిలో వెండి సామగ్రిని దొంగలు చోరీ చేశారు. ఎస్సై వాసంశెట్టి రవిచంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పందలపాక గ్రామానికి చెందిన లాల్‌బహదూర్ రెడ్డి కుటుంబంతో ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లారు. దొంగలు గురువారం రాత్రి ఆ ఇంట్లోకి చొరబడి సుమారు కిలో వెండి పూజా సామగ్రిని దోచుకుపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేస్తున్నారు.

విద్యా సుమాలు.. క్రీడా యోధులు

- చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం
- కరాటేలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు
- ఆసక్తి చూపుతున్న బాలికలు
- పలు పోటీల్లో విజయకేతనం



కరాటేలో ప్రతిభ చూపిన చిన్నారులను అభినందిస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్

ప్రకాశం నగర్: చదువుతో పాటు క్రీడలపై చిన్నారులు ఆసక్తి చూపుతున్నారు. విద్యలో రాణిస్తూనే తమకు నచ్చిన క్రీడలో శిక్షణ పొందుతున్నారు. బాలురతో పాటు బాలికలు కూడా ఇదే పంథాలో నడుస్తున్నారు. ఈ నేపథ్యంలో కరాటే విద్యను ఇటీవల ఆదరణ బాగా పెరుగుతోంది. ఆత్మరక్షణ కోసం కొందరు, హాబీగా మరి కొందరు విద్యార్థులు ఈ విద్యను నేర్చుకుంటున్నారు. వీరిలో కొందరు క్రీడాకారులు సెల్ఫ్ టెక్నిక్స్ విభాగంలో పలు మెళకువలు నేర్చుకుంటూ, ప్రత్యర్థిని మట్టి కరిపించే రీతిలో శిక్షణ తీసుకుంటున్నారు. కరాటేలో మంచి ప్రతిభను కనబరిచి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయాలు సాధించి పలు పతకాలు సాధిస్తున్నారు. ప్రస్తుతం సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో కరాటే వంటి శిక్షణ వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంచడంతో పాటు, ఆపదను తప్పించుకోవడానికి వీలుగా ఉంటుందని శిక్షకులు చెబుతున్నారు. అయితే మిగిలిన క్రీడలతో పోల్చితే కరాటేకు కఠోరమైన శిక్షణ, ఏకాగ్రత, క్రమశిక్షణ అవసరం. ఇవి లేకపోతే ఈ విద్యలో రాణించడం సులభం కాదు.

జాతీయ స్థాయిలో పతకాలు

కాకినాడ ఇంద్రపాలెంలోని సుబ్బిరామిరెడ్డి ఇండోర్ స్టేడియంలో ఇటీవల జరిగిన విక్టరీ షోటో ఖాన్ కరాటే జాతీయ స్థాయి పోటీల్లో కటాస్ స్పరింగ్ 12, 19 ఏళ్ల విభాగాల్లో నగరానికి చెందిన పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ప్రతిభ చూపారు. వారిలో సీహెచ్ నిషిత్, ఎం.ప్రసన్న, వెంకట నాగ సూర్యశ్రీ బంగారు పతకాలు సాధించారు. ఆర్.మనోజ్ఞ, డి.చిన్మయ, వి.ఇందు, సీహెచ్ సునంద వెండి పతకాలు గెలుచుకున్నారు. కె.చరణీ కృతి, జి.స్టీఫెన్ రాహుల్, కె.రుత్విక్, వి.అఖిల్ తేజ్ కాంస్య పతకాలు పొందారు.

విజేతలకు అభినందనలు

జాతీయ స్థాయి కరాటే పోటీలో పతకాలు సాధించిన విద్యార్థులను జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్ ప్రత్యేకంగా అభినందించారు. సర్టిఫికెట్లు, మెడల్లు అందజేసి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కరాటే మాస్టర్ పి.అరుణ్ కుమార్‌తో పాటు ఆయా పీడీలకు అభినందనలు తెలిపారు.

కొరవడిన ప్రభుత్వ సాయం

క్రీడల్లో విద్యార్థులు రాణించి, పలు పతకాలు సాధించినప్పటికీ వారికి శిక్షణ, ప్రోత్సాహం అందించడంలో ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని పలువురు సీనియర్ క్రీడాకారులు అభిప్రాయపడుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో క్రీడాకారులకు స్కూల్స్ గేమ్స్‌తో పాటు ఆడుదాం ఆంధ్ర వంటి పోటీలను నిర్వహించి గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు చర్యలు తీసుకుంది. ఆటల పోటీలు నిర్వహించడంతో పాటు విజేతలకు నగదు ప్రోత్సాహకాలు అందించి, వారికి ఆర్థికంగా చేయూత నిచ్చింది.

పెరిగిన ఆసక్తి



గతంతో పోలిస్తే ప్రస్తుతం కరాటే నేర్చుకునే బాలికలు బాగా పెరిగారు. ఆయా పోటీల్లో పాల్గొని, పతకాలు కూడా సాధిస్తున్నారు. ముఖ్యంగా సెల్ఫ్ టెక్నిక్స్ విభాగంలో మంచి పట్టు సాధిస్తున్నారు. ఇది ఆత్మరక్షణకు ఎంతగానో ఉపయోగపడుతుంది. పిల్లలకు తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉంటే మరిన్ని విజయాలు సాధించే అవకాశం ఉంటుంది.

– పిల్లి అరుణ్ కుమార్, కరాటే మాస్టర్



కరాటేలో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థినులు

గోవుల అక్రమ రవాణాను అరికట్టాలి



ఎస్పీకి వినతి పత్రం ఇచ్చి వెలుపలకు వస్తున్న భారతానంద మహారాజ్ తదితరులు

సీటీఆర్ఐ: గోవులను అక్రమ రవాణాను అరికట్టాలని భారత్ శక్తిపీఠం అధ్యక్షుడు, హిందూ మహాసభ దక్షిణ భారత ఆర్గనైజింగ్ సెక్రటరీ భారతానంద్ మహారాజ్ అన్నారు. ఆయన శుక్రవారం విశాఖపట్నం నుంచి రాజమహేంద్రవరం విచ్చేసి, ఎస్పీ నరసింహ కిశోర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల నుంచి కాకినాడ, రాజమహేంద్రవరం, విజయవాడ మీదుగా ఇతర రాష్ట్రాలకు గోవుల అక్రమ రవాణా జరుగుతోందన్నారు. ఇలా చేస్తూ పట్టుబడిన వారిపై కేసులు పెట్టినా, ఆ వ్యాపారం ఆగడం లేదన్నారు. గోకవరం మండలం కృష్ణుడిపాలెంలో గత ఐదారు ఏళ్లుగా కొన్ని వేల పశువులను పోలీసులు సంరక్షణపై అక్కడ ఉంచారన్నారు. కానీ అక్కడ ఉన్న గోశాలలో ఒక్క గోవు కూడా లేదన్నారు. గోవుల అక్రమ రవాణాను అరికట్టాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పలువురు సాధువులు పాల్గొన్నారు.

మాతృభాషతోనే మానవజాతి మనుగడ



గూటం స్వామిని సత్కరిస్తున్న హెచ్ఎం నరసింహారెడ్డి తదితరులు



సంగీత కచేరీలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు



ర్యాలీ చేస్తున్న బీఈఎం ఎయిడెడ్ ఉన్నత పాఠశాల విద్యార్థులు

రాజమహేంద్రవరం రూరల్: నీతి, నిజాయితీ, మంచి నడవడికను నేర్పేది మాతృభాష అని ప్రముఖ కవి, రచయిత, తెలుగు భాషాభివృద్ధి సమితి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గూటం స్వామి అన్నారు. అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం బొమ్మూరులోని జీపీఆర్ ఉన్నత పాఠశాలలో ఫిలాంత్రోపిక్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు అద్దంకి రాజాయోనా ఆధ్వర్యంలో పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు ఎం.నరసింహారెడ్డి అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ తల్లి భాష నేర్చుకోకపోతే మానవజాతి మనుగడ లేదన్నారు. అనంతరం గూటం స్వామిని తెలుగు తేజం బిరుదుతో ఘనంగా సత్కరించారు. ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ పోటీలో కాంస్య పతకం సాధించిన తొమ్మిదో తరగతి విద్యార్థి ఎం.నవీన్, రాష్ట్ర స్థాయిలో జరిగిన ఈఈఎంటీ – 2025 పరీక్షలో జిల్లా టాపర్‌గా నిలిచిన పదో తరగతి విద్యార్థి కె.జగదీష్‌కు నగదు బహుమతి అందించారు.

పరభాషా పదాలతో అనర్థం

సీటీఆర్ఐ: పరభాషా పదాలను విచ్చలవిడిగా వాడటం వల్ల తెలుగుభాషకు అనర్థం కలుగుతుందని జిల్లా ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు అన్నారు. ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ, కళాగౌతమి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంగ్లిషు పదాలకు తెలుగు పదాలను సృష్టించుకోవాలన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తెలుగు ఆచార్యులు తరపట్ల సత్యనారాయణ మాట్లాడుతూ అంతర్జాలంలో తెలుగును విరివిగా వాడాలన్నారు.

- మాతృభాషను కాపాడుకోవాలని విజయ శంకర ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.నాగలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రత్యేక కార్యక్రమాలు

కంబాలచెరువు: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా మున్సిపల్ కాలనీలోని బీఈఎం ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ బి.చిట్టిబాబు, ప్రధానోపాధ్యాయురాలు బి.శారద తదితరులు తెలుగు తల్లి చిత్ర పటాన్ని పుష్పాలతో అలంకరించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ చేశారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయురాలు మనోజ్ఞ తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషను మరువొద్దు

కడియం: జన్మనిచ్చిన మాతృమూర్తిని, మాతృభాషను మరువరాదని హెచ్ఎం టి.సత్యనారాయణ అన్నారు. స్థానిక హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ మాతృభాషా దినోత్సవ ప్రత్యేకతను వివరించారు. వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా అన్ని వసతులు

రాజమహేంద్రవరం సిటీ: మహాశివరాత్రి సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించడానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వివిధ శాఖల సమన్వయంతో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. నగరపాలక సంస్థ, వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన శుక్రవారం నగరంలోని పలు గోదావరి ఘాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రేవులను డ్రోన్ల ద్వారా పర్యవేక్షించాలని, దానికి అవసరమైన డ్రోన్ కెమెరాలు సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ సమన్వయంతో పాలిచ్చే తల్లులకు విడిగా సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. స్త్రీలు, పురుషులు విడివిడిగా స్నానాలు చేసేలా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ నెల 25వ తేదీ రాత్రి నుంచి భక్తులు రేవులకు వచ్చే అవకాశం ఉన్నందున అన్ని రేవులలో లైట్లు పూర్తిస్థాయిలో పనిచేసేలా చూడాలన్నారు. ఆయన వెంట అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, సూపరింటెండింగ్ ఇంజినీర్ జి.పాండురంగారావు, సిటీ ప్లానర్ జి.కోటయ్య, డిప్యూటీ సిటీ ప్లానర్ సత్యనారాయణరాజు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మాధవి తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పోషకాహార కిట్లను పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని, గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని రామకృష్ణ మిషన్ ఇన్‌చార్జి స్వామి రఘువీరానందజీ మహారాజ్ అన్నారు. శంభూనగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మిషన్ కేంద్రం ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఆర్థిక సాయంతో సమకూర్చిన పోషకాహార కిట్లను బాలింతలు, గర్భిణులకు రఘువీరానందజీ మహారాజ్, డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ సాధికారిత అధికారి కె.విజయకుమారి అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ పి.ప్రసన్నలక్ష్మి, డాక్టర్ దిలీప్ కుమార్, డాక్టర్ సంధ్య పాల్గొన్నారు.

బియ్యం బస్తాల బరువును సరిచూసుకోవాలి



ఎంఎల్ఎస్ పాయింట్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో కృష్ణ నాయక్

రాజమహేంద్రవరం రూరల్: ఎంఎస్ఎల్ పాయింట్ల నుంచి సరఫరా అవుతున్న బియ్యం తూకం కచ్చితంగా ఉండేలా చూసుకోవాలని రెవిన్యూ డివిజన్ అధికారి ఆర్.కృష్ణ నాయక్ అన్నారు. బొమ్మూరులోని పౌరసరఫరాల ఎంఎస్ఎల్ పాయింట్‌ను శుక్రవారం సాయంత్రం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గన్ని బ్యాగు కాకుండా ప్రతి బస్తా 50 కేజీలు ఉండాలన్నారు. సాధారణంగా గన్నీ బ్యాగు బరువు 580 గ్రాములు ఉంటుందని తెలిపారు. పరిశీలనలో కొన్ని బియ్యం బస్తాల బరువు 50 కేజీలు, మరికొన్ని 49.800 కేజీలు ఉన్నట్లు గుర్తించామన్నారు. బఫర్ స్టాక్ గోడౌన్ నుంచి తీసుకుని వచ్చే సందర్భంలో సరి చూసుకునే బాధ్యత ఎంఎస్ఎల్ పాయింట్ ఇన్‌చార్జిదేనన్నారు. ఆయన వెంట తహసీల్దార్ సూర్యజయకుమార్, ఎంఎస్ఎల్ పాయింట్ ఇన్‌చార్జి డీటీ శ్రీనివాస్ ఉన్నారు.

రిఫ్రిజిరేటర్, ఏసీ సర్వీసింగ్‌లో శిక్షణ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరంలోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈ నెల 24 నుంచి రిఫ్రిజిరేటర్, ఏసీ రిపేర్ సర్వీసింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ విషయాన్ని ఆ సంస్థ డైరెక్టర్ తాడి శ్రీనివాసరావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 ఏళ్ల నుంచి 45 ఏళ్ల వయసున్న వారు అర్హులన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై, తెల్లరేషన్ కార్డు, ఆధార్‌కార్డు ఉండాలన్నారు. శిక్షణ సమయంలో భోజనం, వసతి కల్పిస్తామన్నారు. ఆసక్తి కలవారు 0883-242024, 2428807, 97013 59954, 90143 28803 నంబర్లను సంప్రదించాలన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు



పోటీలను తిలకిస్తున్న గూడూరి శ్రీనివాస్, రౌతు సూర్యప్రకాశరావు

ప్రకాశం నగర్: క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని వైఎస్సార్ సీపీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి శ్రీనివాస్ అన్నారు. స్థానిక చెరుకూరి కన్వెన్షన్ హాలులో ఏపీ స్టేట్ వుమెన్స్ ఊషూ లీగ్ పోటీలను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావుతో కలిసి ఆయన తిలకించారు. జూనియర్స్, సీనియర్స్ విభాగంలో జరిగిన పోటీల్లో పలువురు క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఏటా ఈ పోటీలు నిర్వహిస్తున్న నిర్వాహకుడు అజ్జరపు వాసును అభినందించారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ క్రీడాకారులు మంచి ప్రతిభ కనబరిచి జాతీయ పోటీల్లో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. అజ్జరపు వాసు మాట్లాడుతూ ఈ పోటీలకు 250 మంది క్రీడాకారులకు హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు ముత్యాలరావు, నరసింహారావు, సుందర్ రావు, మాజీ కార్పొరేటర్ వాకచర్ల కృష్ణ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉద్భవ్ వేడుకలు

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో ఉద్భవ్ యువజన ఉత్సవాలు రెండోరోజు శుక్రవారం ఉత్సాహంగా కొనసాగాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం, సుడోకు, పోస్టర్ మేకింగ్ మ్యూజిక్, రంగవల్లుల పోటీలు నిర్వహించారు. శనివారం ముగింపు వేడుకలు జరగనున్నాయి.

ఎమ్మెల్సీ పోలింగ్‌కు తొమ్మిది కేంద్రాలు



సూర్యకుమార్, తహసీల్దార్

రాజమహేంద్రవరం రూరల్: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి మండలంలో తొమ్మిది పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ పీవీవీ జయసూర్యకుమార్ తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 6,385 పట్టభద్రుల ఓట్లు ఉన్నాయన్నారు. ధవళేశ్వరం రెండు, బొమ్మూరులో ఒకటి, హుకుంపేటలో రెండు, కొంతమూరులో నాలుగు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. కొంతమూరులో కొంతమూరు, కాతేరు, వెంకటనగరం, తొర్రేడు ఓటర్లు, అలాగే హుకుంపేటలో హుకుంపేట, శాటిలైట్ సిటీ, పిడింగొయ్యి ఓటర్లు, బొమ్మూరులో బొమ్మూరు, ధవళేశ్వరంలో ధవళేశ్వరం, రాజవోలు ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకుంటారన్నారు. ఓటరు స్లిప్‌ల పంపిణీ రెండు రోజుల నుంచి ప్రారంభించడం జరిగిందన్నారు.

పేద విద్యార్థులకు నర్సింగ్ సీట్లు

కంబాలచెరువు: శ్రీకాకుళం జెమ్స్ కళాశాలలో బీఎస్సీ నర్సింగ్, పోస్ట్ బేసిక్ నర్సింగ్‌లో సీట్లు అందుబాటులో ఉన్నట్టు బొల్లినేని మెడ్స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు తెలిపారు. బీఎస్సీ నర్సింగ్‌కు ఇంటర్ బైపీసీ, పోస్ట్ బేసిక్ నర్సింగ్‌కు జీఎన్ఎం ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. అభ్యర్థులను ఉచితంగా చదివించి, కోర్సు పూర్తయ్యాక ఉద్యోగం ఇచ్చి, జీతంలో నుంచి ఫీజును మినహాయిస్తామని ఆయన తెలిపారు.

ముందు అద్భుతం.. వెనుక అధ్వానం

- చెత్తమయంగా వైటీసీ వెనుక భాగం
- విష సర్పాలకు నిలయం
- డంపింగ్ యార్డుగా మారిన వైనం
- పట్టించుకోని అధికారులు



చిట్టడవిని తలపిస్తున్న వైటీసీ ప్రాంగణం వెనుక భాగం



వైటీసీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కుండీలు



జిల్లా పోలీసు ఫిర్యాదుల సంస్థ కార్యాలయం వెనుక పేరుకుపోయిన చెత్త



డ్వామా కార్యాలయం వెనుక వేసిన చెత్త

రాజమహేంద్రవరం రూరల్: ప్రతి నెలా మూడో శనివారం స్వర్ణ ఆంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర అంటూ కార్యక్రమం నిర్వహించి, చీపుళ్లతో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించే అధికారులు.. కార్యాలయం వెనుకనే చెత్తతో నిండిన చిట్టడవిని పట్టించుకోవడం లేదు. దాని నుంచి విష సర్పాలు కార్యాలయ గదుల్లోకి రావడంతో ఉద్యోగులు సైతం భయాందోళనకు గురవుతున్నారు. కార్యాలయంలో వచ్చే చెత్తను వెనుక వైపే పారబోస్తుండడంతో ఆ ప్రదేశం చిన్నపాటి డంపింగ్‌యార్డులా మారింది. బొమ్మూరులోని ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణం వైటీసీ కేంద్రం దుస్థితి ఇది.

అనేక కార్యాలయాలు

బొమ్మూరులోని వైటీసీ కేంద్రంలో జిల్లా పంచాయతీ అధికారి, డ్వామా, జిల్లా స్పోర్ట్స్ అధికారి, మైక్రో ఇరిగేషన్, సమాచార శాఖ, జిల్లా పోలీసు ఫిర్యాదుల సంస్థ, జిల్లా పరిశ్రమల శాఖ, ఫుడ్ క్వాలిటీ కంట్రోల్, జిల్లా అగ్నిమాపకశాఖ, ఏపీ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్, నెడ్‌కాప్, మార్క్‌ఫెడ్, డీఆర్‌డీఏ తదితర జిల్లా కార్యాలయాలు ఉన్నాయి. వైటీసీ ప్రాంగణాన్ని ముందు నుంచి చూస్తే ఎంతో అందంగా కనిపిస్తుంది. ఒక్కసారి వెనుక వైపు వెళ్లి చూస్తే చిట్టడవిని తలపిస్తుంది. ప్రభుత్వ కార్యాలయాల్లోని చెత్తను సైతం సదరు సిబ్బంది కార్యాలయాల వెనుక వైపే వేస్తున్నారు. జిల్లా పంచాయతీ అధికారుల చెత్త మాత్రం డైరెక్టుగా కింద ఉన్న జిల్లా పోలీసు ఫిర్యాదుల సంస్థ కిటికీలో వేస్తున్నారు. ఈ విషయంపై సదరు కార్యాలయం అధికారులకు విన్నవించినా పట్టించుకున్న దాఖలాలు లేవు. చెత్త సమస్యను పరిష్కరించేందుకు జిల్లా పోలీసు ఫిర్యాదుల సంస్థ సభ్యుడు, విశ్రాంత డీఆర్‌వో ఎం.జితేంద్ర.. వైటీసీ ప్రాంగణంలో పంచాయతీ కార్యదర్శి ద్వారా రెండు కుండీలను ఏర్పాటు చేయించారు. అయినప్పటికీ ప్రభుత్వ కార్యాలయంలోని చెత్తను కుండీలలో వేయకుండా వెనుకనే పారబోస్తున్నారు.

మర్యాదపూర్వకంగా..



వీసీ ప్రసన్నశ్రీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కేంద్ర కారాగార పర్యవేక్షణాధికారి రాహుల్

కంబాలచెరువు: నన్నయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఎస్.ప్రసన్నశ్రీని శుక్రవారం రాజమహేంద్రవరం కేంద్ర కారాగార పర్యవేక్షణాధికారి ఎస్.రాహుల్ మర్యాద పూర్వకంగా కలిశారు. విశ్వవిద్యాలయం ప్రధాన కార్యాలయంలో ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. సెంట్రల్ జైలులో ఖైదీలకు మనోవికాస శిక్షణ కోసం సైకాలజీ ఆచార్యులను నియమించాలన్నారు.

ఆ తప్పులను సరిదిద్దండి

కంబాలచెరువు: గ్రూప్–2 మెయిన్స్‌లో తప్పులను సరిదిద్దాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎండీ రఫీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్ ప్రభుత్వానికి తెలియజేశారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. గ్రూప్–2 మెయిన్స్‌కి అర్హత సాధించిన 92,250 మంది అభ్యర్థుల తరపున కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు.